క్లుప్తంగా

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు (కిలో రూపాయల్లో).. టమోటా 19, వంకాయ 18, బెండ 50, పచ్చిమిర్చి 40, కాకర 45, బీర 45, క్యాలీఫ్లవర్ 25, క్యాబేజీ 10, క్యారెట్ 17, దొండ 45, ఆలు 18, ఉల్లి 15, గోకర 40, దోస 35, సొర 15, పొట్ల 15, అరటి 10, చిక్కుడు 40, అర్వి 68, మునగ 45, చిలకడదుంప 40, బీట్‌రూట్ 18, కీర 21, ఫ్రెంచ్ బీన్స్ 45, క్యాప్సికమ్ 45. ఈ ధరలు బుధవారం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

యువకుడి ఆత్మహత్య

నాగోలు: యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎల్‌బీనగర్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మెదక్ జిల్లా, బొమ్మారం గ్రామానికి చెందిన యాదయ్య కుటుంబంతో కలిసి ఎల్‌బీనగర్ బైరామల్‌గూడలోని సాయినగర్ కాలనీలో ఉంటున్నాడు. యాదయ్య కుమారుడు వేగు కార్తీక్(24) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. యాదయ్య తన భార్య సంతోషితో కలిసి మూడు రోజుల క్రితం పనిమీద సొంత గ్రామం వెళ్లారు. వారు మంగళవారం ఉదయం నుంచి కార్తీక్‌కు ఫోన్ చేస్తున్నప్పటికీ స్పందన లేకపోవడంతో పక్కింటి వారికి ఫోన్ చేసి కార్తీక్‌తో మాట్లాడించమని చెప్పారు. వారు వెళ్లి డోర్ కొట్టినా తెరవకపోవడంతో కిటికీలోనుంచి చూడగా కార్తీక్ ఉరివేసుకుని కనిపించాడు. స్థానికులు కిందకు దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి సోదరుడు భార్గవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు.

ఇక నీటి కష్టాలకు చెక్

రామంతాపూర్: రామంతాపూర్‌లోని నేతాజీనగర్, రాజేంద్రనగర్‌లోని హిందూ శ్మశానవాటికల్లో బోరు పంపులు పనిచేయక వారం రోజులుగా అంత్యక్రియలకు హాజరయ్యే వారు ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని 'శ్మశానంలో నీటి కష్టాలు' శీర్షికన మంగళవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఉన్నతాధికారులు సెలవు రోజైన మంగళవారం బోరు పంపులకు మరమ్మతులు చేయించారు. దీంతో స్థానికులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలకు పెద్దపీట

సుల్తాన్‌బజార్: మహిళా దినోత్సవం వేళ తెలంగాణ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని తొలి తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ ఎం.విజ్ఞులత అన్నారు. అదే కళాశాలలో ప్రిన్సిపాల్‌గా ఉన్న ఆమెను ప్రభుత్వం ఇన్‌చార్జ్ వీసీగా నియమించడాన్ని కళాశాల విశ్వ విద్యాలయం అధ్యాపకులు, సిబ్బంది స్వాగతిస్తున్నారు. తాను ఇదే కళాశాల విద్యార్థినిగా, అధ్యాపకురాలిగా, కళాశాల ప్రిన్సిపాల్‌గా విద్యార్థుల సాదకబాధకాలు తెలుసున్నారు. విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, ల్యాబ్‌లు, ఆటస్థలాలు, అధ్యాపకులు, సిబ్బంది ఇతరాత్ర అవసరాలపై ప్రభుత్వానికి నివేదిక పంపించామని వీసీ విజ్ఞులత 'సాక్షి'తో తెలిపారు. తెలంగాణలో మహిళా విశ్వ విద్యాలయంలో పెనుమార్పులు తీసుకువచ్చేలా కృషి చేస్తున్నామని, విద్యార్థులకు విద్యతో పాటు విజ్ఞానం కలిగేలా అధ్యయనాలు చేసేలా ప్రోత్సహిస్తామని ఆమె తెలిపారు. రాష్ట్రంలోనే మహిళా విశ్వ విద్యాలయాన్ని ఎంతో పేరుగాంచే విధంగా తీర్చిదిద్దుతామని ఆమె అన్నారు. ఇప్పటికే ఈ కళాశాలలో ఎంతో మంది విద్యార్థులుగా ఉన్నవారు సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్నారని, వారి ప్రోత్సహం సైతం తమకు ఉందన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఘనంగా హోలీ వేడుకలు



వనస్థలిపురంలో హోలీ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



హోలీ ఉత్సవాల్లో డ్యాన్స్ చేస్తున్న మన్సూరాబాద్ కార్పొరేటర్ నర్సింహారెడ్డి

హోలీ పర్వదినం సందర్భంగా ఎల్బీనగర్, మలక్‌పేట్ నియోజకవర్గాల పరిధిలో మంగళవారం చిన్నారులు, యువత, మహిళలు సందడి చేశారు. ఆటపాటలతో వీధులను హోరెత్తించారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు. పలు ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకల్లో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని సందడి చేశారు.

– ఎల్బీనగర్, మలక్‌పేట్ జోన్ల బృందం



సామ రంగారెడ్డికి హోలీ శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి దంపతులు



వేడుకల్లో పాల్గొన్న చైతన్యపురి కార్పొరేటర్ నర్సింహగుప్తా



వేడుకల్లో పాల్గొన్న నాగోలు కార్పొరేటర్ అరుణాసురేందర్‌యాదవ్



సైదాబాద్ ఏపీఏయూ కాలనీలో..



వాసవీకాలనీలో హోలీ వేడుకలు..



హోలీ ఉత్సవాల్లో కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

నాగోలు: ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఎల్‌బీనగర్ పోలీస్‌లు తెలిపిన వివరాల మేరకు.. ఎన్టీఆర్‌నగర్ కూరగాయల మార్కెట్ వద్ద ఈ నెల 4న ఎల్‌బీనగర్ పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. అక్కడ ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి(40) అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. అతడిని పరిశీలించగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. వెంటనే 108 వాహనంలో ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు ఎల్‌బీనగర్ పోలీసులకు ఆస్పత్రి సిబ్బంది సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరణిస్తూ ముగ్గురికి జీవితం



మురళి (ఫైల్)

మన్సూరాబాద్: తాను మరణిస్తూ మరో ముగ్గురికి జీవితం ప్రసాదించాడు ప్రైవేటు ఉద్యోగి. కామినేని హాస్పిటల్స్ ప్రతినిధులు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు జిల్లా నంబూరుకు చెందిన కొండవీటి మురళి (30) చౌటుప్పల్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. గత నెల 27న రాత్రి 10.30 గంటల సమయంలో తన బైక్‌పై వెళ్తుండగా డివైడర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం కామినేని ఆస్పత్రికి తరలించగా ఈ నెల 5న బ్రెయిన్ డెడ్ అయ్యిందని వైద్యులు తెలిపారు. అవయవదానంపై మురళి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడంతో సోమవారం అతడి అవయవాలను దానం చేసేందుకు తండ్రి కోటేశ్వర్‌రావు సమ్మతించారు. లివర్, రెండు కిడ్నీలను దానం చేయడంతో ముగ్గురి జీవితాల్లో వెలుగులు నింపాడని వైద్యులు పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం



హస్తినాపురం: ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతలకుంట శక్తినగర్ కాలనీకి చెందిన మడిగెల రసిక (61) ఈ నెల 5న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారు, బంధువుల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హిందువుగా పుట్టినందుకు గర్వపడుతున్నా

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



అయ్యప్ప పడిపూజలో బండి సంజయ్, మధుసూదన్‌రెడ్డి

హస్తినాపురం: హిందూ సంస్కృతి, సాంప్రదాయాలను ఆచరించడం మూలంగానే మనకు గౌరవం పెరుగుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని బైరామల్‌గూడ కర్మన్‌ఘాట్ హరిహరక్షేత్ర అయ్యప్ప దేవాలయం వ్యవస్థాపక చైర్మన్ వంగా మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పుష్కర బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపు రోజు సోమవారం రాత్రి ఆలయంలో నిర్వహించిన అయ్యప్ప మహా పడిపూజకు బండి సంజయ్ హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందువుల సాంప్రదాయాలను విదేశీయులు నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. హిందువుగా పుట్టినందుకు తానెంతో గర్వపడుతున్నానని ఆయన అన్నారు. మన సంస్కృతి, సాంప్రదాయాలు, సనాతన ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, గంగిడి మనోహర్‌రెడ్డి, బొక్క నర్సింహారెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ వంగా చంద్రారెడ్డి, రమణ గురుస్వామి, డైరెక్టర్లు సద్ది సందీప్‌రెడ్డి, లంకల రమేశ్‌రెడ్డి, మిర్యాల అంజయ్యగుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్‌ను ప్రారంభించమంటే అరెస్టు చేస్తారా?

- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఎల్‌బీనగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ప్రభాకర్‌రెడ్డి
- నిర్మాణం పూర్తి చేసుకున్న ఫ్లైఓవర్‌ను ప్రారంభించాలని డిమాండ్
- ర్యాలీగా ఫ్లైఓవర్ వద్దకు వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు
- పరిస్థితి ఉద్రిక్తం.. వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



ఫ్లైఓవర్ పైకి వెళ్లేందుకు ప్రయత్నించిన ప్రభాకర్ రెడ్డిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

మన్సూరాబాద్: నిర్మాణం పూర్తి చేసుకున్న ఫ్లైఓవర్‌ను ప్రారంభించమంటే అరెస్టులు చేయడం ఏంటని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. ఎల్‌బీనగర్‌లో నూతనంగా నిర్మించిన రెండవ ఫ్లై ఓవర్‌ను ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ నేతలు మంగళవారం ర్యాలీలతో నలువైపుల నుంచి వచ్చి ఫ్లై ఓవర్ పైకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఎల్‌బీనగర్ పోలీసులు ముందస్తుగా భారీ ఎత్తున బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని అడ్డుకుని అరెస్ట్ చేశారు. దీంతో ఇక్కడ కాసేపు ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, దర్పెల్లి రాజశేఖర్‌రెడ్డి, మిద్దెల జితేందర్ మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం నిర్మించిన ఫ్లై ఓవర్‌ను ప్రారంభించేందుకు మంత్రులకు సమయం లేకపోవడం దురదృష్టకరమన్నారు. సోమవారం లోపు ప్రారంభించాలని పలుసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రభుత్వ పెద్దలు, స్థానిక ఎమ్మెల్యే స్పందించకపోవడంతో తామే ప్రారంభించేందుకు వచ్చామన్నారు. ఫ్లై ఓవర్‌ను ప్రారంభించమంటే అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని, మనం బంగారు తెలంగాణలో ఉన్నామా, బారికేడ్ల తెలంగాణలో ఉన్నామా అని ప్రశ్నించారు. ఫ్లై ఓవర్ ప్రారంభంలో జాప్యం కావడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి లేదు..

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి ఫ్లై ఓవర్ విషయంలో చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఎన్నికల్లో లబ్ధిపొందడం కోసమే ఎమ్మెల్యే ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవాన్ని వాయిదా వేస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన కాంగ్రెస్ నేతలను బాలాపూర్ స్టేషన్‌కు తరలించి తర్వాత విడుదల చేశారు. కార్యక్రమంలో బర్రె రాజ్‌కుమార్, బోడ రాజశేఖర్, బుడ్డ సత్యనారాయణ, మల్లారపు శ్రీనివాస్, శశిధర్‌రెడ్డి, మెరుగు రమేష్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, విష్ణు, శివ, చర్ల రమేష్, శ్రీనాథ్, రోహిత్, రాము తదితరులు పాల్గొన్నారు.



ఫ్లై ఓవర్ వద్ద పెద్ద ఎత్తున మోహరించిన ఎల్‌బీనగర్ పోలీసులు

ఐక్యంగా ఉంటూ.. సేవ చేస్తూ..!

- టీంగా ఏర్పడిన జనప్రియ హోమ్స్ కాలనీ మహిళలు
- శ్రీ వైష్ణవి జనప్రియ మహిళా మండలి ఏర్పాటు
- పదేళ్లుగా సేవా కార్యక్రమాల నిర్వహణ



శ్రీ వైష్ణవి జనప్రియ హోమ్స్ మహిళా మండలి సభ్యులు

వనస్థలిపురం: వనస్థలిపురం జనప్రియ హోమ్స్ కాలనీకి చెందిన శ్రీ వైష్ణవి జనప్రియ మహిళా మండలి సభ్యులు తమ ఇళ్లను చక్కదిద్దుకుంటూనే సమాజహితం కోసం తమ వంతు సేవలు అందిస్తున్నారు. కాలనీ మహిళలకు రిక్రియేషన్ కల్పించడంతో పాటు సమాజ సంక్షేమానికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. క్రీడలు, వివిధ రకాల పోటీల ద్వారా మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను, కళలను వెలికితీస్తున్నారు. వనస్థలిపురం డివిజన్ పరిధిలోని జనప్రియ హోమ్స్ కాలనీలో పదేళ్ల క్రితం కాలనీ మహిళలు శ్రీ వైష్ణవి జనప్రియ మహిళా మండలిని ఏర్పాటు చేసుకున్నారు. అప్పటి నుంచి ప్రతి బుధవారం సమావేశం నిర్వహించుకుంటూ పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. కాలనీ మహిళలకు రిక్రియేషన్ కల్పించడం కోసం ఫ్రీ తంబోలా, కుకింగ్ డెమో, షార్ట్, లాంగ్ డ్యూరేషన్ గేమ్స్, టాలెంట్ షోలు నిర్వహిస్తున్నారు. రిపబ్లిక్ డే, ఇండిపెండెన్స్ డే, చిల్డ్రన్స్ డే, ఉమెన్స్ డే, మహిళా మండలి వార్షికోత్సవాలు చేసుకుంటుంటారు.



కాలనీలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం(ఫైల్)

చేపడుతున్న కార్యక్రమాలు..

- అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలకు వెళ్లి సాయం అందించడం.
- వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు.
- మహిళల కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం.
- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బుక్స్ పంపిణీ.
- ప్రత్యేక రోజుల్లో మహిళలకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించడం.

పదేళ్లుగా సేవా కార్యక్రమాలు..



2012లో మహిళా మండలిని ఏర్పాటు చేసుకుని పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఉచిత వైద్య శిబిరాలు, చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేయడంతో పాటు అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలకు చేయూత అందిస్తున్నాం.

– పి.జ్యోతి సాయి, మహిళా మండలి అధ్యక్షురాలు

వైభవంగా సత్యదేవుడి కల్యాణం

రామంతాపూర్: ఉప్పల్ సర్కిల్ రామంతాపూర్‌లోని రమాసహిత సత్యనారాయణ స్వామి దేవస్థానంలో 50వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దేవస్థానం కల్యాణ మండప వేదికపై సత్యనారాయణ స్వామి రమాదేవిల కల్యాణ వేడుకలను మంగళవారం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మీ, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, ఆలయ చైర్మన్ కోట్ల నర్సింహారెడ్డి స్వామి వార్లకు పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. కల్యాణ వేడుకలకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది తరలివచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దర్గా దయాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు బండారు శ్రీవాణివెంకట్రావు, బొంతు శ్రీదేవి, మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్ననాగేశ్వర్‌రావు, ఆలయ ఈవో సత్య చంద్రారెడ్డి, అన్నమనేని జగదీష్, ప్రధానార్చకులు పాల్గొన్నారు.



రోడ్డు పనులు పూర్తి చేయాలని నిరసన



రోడ్డు పనులు పూర్తి చేయాలని నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

మన్సూరాబాద్: రోడ్డు పనులు ప్రారంభించి మూడు నెలలు గడుస్తున్నా పనులు పూర్తి చేయడంలో అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నారని హయత్‌నగర్‌లోని బాలాజీనగర్ కాలనీవాసులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. రూ.32 లక్షలతో కాలనీలో చేపట్టిన బీటీ రోడ్డు పనులు మూడు నెలల క్రితం ప్రారంభించినట్లు వారు తెలిపారు. అయితే ఇప్పటి వరకు కంకర మాత్రమే వేసి వదిలివేశారని, దీంతో తాము అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే పనుల్లో జాప్యం నెలకొందని కాలనీవాసులు మండిపడుతున్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ప్రభాకర్, కొండారెడ్డి, శంకర్‌రెడ్డి, శ్రావణ్, సురేష్, హనుమంత్‌రెడ్డి, శివప్రసాద్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్' మేళాకు విశేష స్పందన

వనస్థలిపురం: వనస్థలిపురంలోని హుడా ఓపెన్ ఆడిటోరియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళాకు స్థానికుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. మేళాలో ప్రదర్శించిన వస్త్రాలు, ఇతర ఉత్పత్తుల కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్, లెనిన్, కలంకారీ, బెంగాల్ కాటన్, లక్నో చికాన్, బనారస్ చీరలు, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజెస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి బొమ్మలు తదితర ఉత్పత్తులు తగ్గింపు ధరలకు లభిస్తాయని నిర్వాహకుడు అక్బర్ అలీ తెలిపారు. ఈ అవకాశం కొద్ది రోజులు మాత్రమే ఉంటుందన్నారు.



ఓ స్టాల్‌లో కొనుగోలుదారుల సందడి